# ఓర్పుశాలియైన యేసు అడుగులలో నడుచుట

సోమరితనమును ఓర్పును సమానముగా ఎంచుకొనుట పెద్ద తప్పు. ఊరకుండుటతో ఓర్పును సంబంధపరుచుట పెద్ద తప్పు. నిరాశకు ఓర్పును పోలికగా తీసికొనరాదు. "యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము." (హెబ్రీ 12:2). ప్రక్కన కూర్చొని పందెములో పరుగెత్తువారిని ఆక్షేపించుట కంటే, పందెములో ప్రవేశించి ఓపికతో పరుగెత్తుట శ్రేష్టమైనది.

ఓర్పుకు సంపూర్ణమైన మాదిరి యేసుప్రభువే. ఆయన మన దేవుడును మన రక్షకుడునై యున్నాడు. అది మాత్రమే కాకుండ మన మాదిరియై యున్నాడు. మన జీవితము యొక్క గురి ఏమిటని అడిగితే, ఆత్మరక్షణయని చాలమంది క్రైస్తవులంటారు. హిందువుల నడిగితే ఆత్మ రక్షణ మన చివర గురియని వారుకూడ అంటారు. పరలోకమునకు చేరుట మన గురియేనా? వైకుంఠములో చేరుట మన గురియేనా? ఆత్మ రక్షణ అంటే భావమేమి? ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలో మన ముఖ్యమైన గురి విశదపరచబడెను. అదేదనగా : "మనము క్రీస్తునకు కలిగిన సంపూర్ణమైన పురుషత్వమునకు సమానమైన పురుషత్వము కలవారమగునట్లు దేవుడు మనలను నియమించెను" అనునది. (ఎఫెసీ. 4:11-12). "తన కుమారుడు అనేక సహోదరులలో జ్యేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందు ఎరిగెనో, వారు తన కుమారునితో సారూప్యము గలవారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను." (రోమా 8:29). యేసుప్రభువు మనకు మాదిరియై యున్నాడు. గనుక ఆయన ఓపిక స్వభావము మనలో కలిగినంతవరకు సంపూర్ణమైన రక్షణ రాలేదని చెప్పవలెను.

యేసుప్రభువు తన రాజ్యమెట్లు స్థాపించినాడో మనము చూస్తే ఆయన ఓపిక కనబడును, రాజ్యము స్థాపించుటలో రెండు మార్గములు మాత్రమే కలవు. ఒక మార్గము – బలాత్కార మార్గము, రెండవ మార్గము – ప్రేమ మార్గము. వేసిన ముడి కోయకుండ ఊడదీస్తామని యేసు తీర్మానించెను. ఆ దినములలో యూదులు రోమా బలాత్కార ప్రభుత్వము క్రింద యుండి – మాకు స్వరాజ్యము కావలెనని ఆందోళన చేసిరి. యేసుప్రభువు బాలుడై యున్నప్పుడు ఆయన స్వదేశస్తులు రోమా ప్రభుత్వము మీద రెండుసార్లు తిరుగుబాటు చేసిరి (అపొ. 4:36 సరిపోల్చుము). యేసుప్రభువు ఐదువేల మందికి అద్భుతముగా భోజనము పెట్టినందువలన ఈయనే మాకు రాజు, ఈయన వలననే

మాకు స్వరాజ్యము దొరుకుతుందనుకొని యేసును బలవంతముగా పట్టుకొని తమ రాజునుగా చేయుటకు ఆయన స్వదేశస్తులు ప్రయత్నించిరి. (యోహాను 6:14-15). ఆయన శిష్యులుకూడా వారికి లోబడి ఈ శోధనలో పడిరి. ఆయన ఆ జనసమూహమును ఓపికతో పంపివేయుటలోను తన శిష్యులు ఓడలో వేరుగా పోవలెనని బలవంతము చేసి వేడుకొనుటలోను ఆయన ఓపిక కనబడుచున్నది. ఆ దేశము తిరుగుబాటు తన ముతో నిండియుండగా, యేసుప్రభువు దానికి యొప్పుకొనక తన రాజ్యమును ఓపికతో స్థాపించెను.

ఆయనయందు విశ్వాసముంచని తన స్వంత సహోదరులు ఆయన నెమ్మదిని చూచి, ఆయన ఓపికను చూచి తృప్తిపడక నిన్ను నీవే త్వరగా బహిరంగపరచుకొనుమని అపహాస్యము చేసిరి (యోహాను 7:2-6). నా సమయమింక రాలేదని ఆయన యిచ్చిన జవాబులో ఎంత ఓపిక కనబడుచున్నది!

ఆయన మరణమునకు ముందే – ధైర్యము తెచ్చుకొనుడి. నేను లోకమును జయించి యున్నాననెను. ఎప్పుడు? నూరు సంవత్సరముల లోపలనా? వేయి యేండ్ల లోపలనా? రెండు వేల సంవత్సరముల లోపలనా? లేకపోతే ఎప్పుడు? జయమింకా రాలేదు. యేసు జీవితకాలమున ఆఖరులో నూట ఇరువైమంది మాత్రమే నిల్చినారు. అభివృద్ధి ఇప్పటి వరకు చాలా ఆలస్యముగా ఉన్నది. అయితే ఆయన ఓర్పుగల హృదయము యిప్పటి వరకు కలవరపడ లేదు. తన రాజ్యము స్థిరమైనదని తెలిసికొని యేసుప్రభువు తన మహిమ సింహాసనములో కూర్చొని నెమ్మదిగా గతించుచున్న తరతరములు చూచి మన స్వల్పమైన ప్రయత్నములు ఓపికతో సహించుకొని తనమీద తిరుగుబాటు చేసే హృదయములు బలవంతముగా లోబడేవరకు కాచుకొని యున్నాడు. మనము కూడ ఆయన రాజ్యము విస్తరింప చేయుటలో ఓపికతో పని చేయవలెను. దేవుని రాజ్యమును గూర్చి యేసు చెప్పిన మంచి ఉపమానము ప్రకారముగా మంచి నేలనుండు వారెవరనగా – యోగ్యమైన, మంచి మనస్సుతో వాక్యము విని దానిని అవలంబించి ఓపికతో ఫలించువారు. (లూకా 8:15). ఫలితము ఫలించుటలో ఓపిక యొక్క ప్రాముఖ్యత కనబడును.

మరియొక విషయములో యేసు ఓపిక చూపించుటలో మనకు మంచి మాదిరియై యున్నాడు. మాట్లాడే సమయమొకటి యున్నది. మౌనముగా ఉండవలసిన సమయము మరియొకటి యున్నది. అందరికంటే యేసునందు మౌనముగా నుండే వాడుక మహోన్నత మైనది. యేసు ప్రభువును సంపాదించుకొని ఆయనయందు సమానానుభవము గల వారమగుటకు అనేక విషయములలో మౌనముగా నుండుట మంచిది. ముప్పై ఏండ్ల వయస్సు వచ్చువరకు ఆయన తన ఇంట్లో ఉండి వడ్రంగి పని చేస్తూ ఓపికతో మౌనముగా నుండుట చాలా ఆశ్చర్యకరమైనది. జీవితాంతమున ఆఖరి ఆదివారము సాయం

కాలమున యెరూషలేమునకు వచ్చి దేవాలయములో ప్రవేశించి అక్కడ జరుగుచున్న అన్యాయములు నానా అపవిత్రములు గమనించి మౌనముగా నుండుట ఆశ్చర్యకర మైనది. మూడేండ్ల నుండి వారి అక్రమములు గద్దించుచు సహించుచు వచ్చెను. మరుసటినాడు దేవాలయమును శుభ్రపరచెను. (మార్కు 11:11-16).

పిలాతు ఆయనను విమర్శించుటలోను ప్రజలు ఆయనను సిలువ వేయుటలోను క్లుప్తమైన శక్తిగల మాటలు మాత్రమే పలికెను. అన్యాయములతోను తిట్టుటతోను తన్నుతాను నిర్బంధపర్చుకొన్నాడంటే ఆయన ఓపిక యొక్క లోతు కనబడును. ఆయన తన మౌనముతో ముఖము మార్చుకొనలేదు. చిరచిరలాడ లేదు. మౌనముగా ఉన్నప్పటికినీ కోపమువలన ఆయన మనస్సు కలవరపడ లేదు. మౌనముగా నుండుటకు తన్నుతాను నిర్బంధపరచుకొనుట సమాధానముతోను దయతోను కలిగేది. పనికిరాని ప్రయత్న ములు చేయక నిష్ప్రయోజనమైన మాటలు చెప్పక సహనముతో ఓర్చుకొనెను. ఆయన మౌనము తన మనస్సును పరామర్శ చేసినది. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైనవారలారా, నాయొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతున"ని ఆయన ఇచ్చిన వాగ్దానము యొక్క శక్తి మనము గ్రహించవలెనంటే తన్నుతాను నిర్బంధపరచు కొనిన విధమెట్లున్నదో గ్రహించవలెను. క్రమశిక్షణ చేయుటకు మన శక్తికి మించిన అన్యాయముల వలనను, మనము అడ్డగించలేని అన్యాయముల వలనను మన హృద యములు బ్రద్దలైపోవునప్పుడు – "నా యొద్దకు రండి, మీకు విశ్రాంతి కలుగజేతున"ని ఆయన ఓపికతో ఇచ్చిన వాగ్దానము జ్ఞాపకము చేసికొందుము. యేసుప్రభువు దినము లలో కూడ అన్యాయములు జరిగినవి. ఆయన ఆ అన్యాయములకు లోబడక, ఒప్పు కొనక, ఓపికతో సహించి, ఆ అన్యాయములు క్రమ క్రమముగా పోయే మార్గము సిద్ధము చేసెను. మన దినములలో కూడ మనము అడ్డగించగలిగినంత వరకు అక్ర మములు అడ్డగించి చక్కపెట్టుటకు దేవుడు మనకు ధైర్యమిచ్చును గాక! మనము అడ్డగించలేని అక్రమములు మన శక్తికిమించిన అక్రమములు ఓపికతో సహించుటకు దేవుడు మనకు ఓపిక అనుగ్రహించునుగాక! మరియు అడ్డగించగలిగిన అక్రమములు ఏవో అడ్డగించలేని అక్రమములు ఏవో మనము తెలిసికొనుటకు దేవుడు మనకు కావలసిన బుద్ధిని అనుగ్రహించునుగాక!

అనేక పర్యాయములు దుర్మార్గులెందుకు అభివృద్ధి పొందుతున్నారనే తలంపు కలదు. దేవుడు కనిపెట్టుట లేదా? అని అడుగవచ్చును. ఈ ప్రశ్న లోతుగా ఆలోచించే వారు నాలుగు విధములైన జవాబు లిచ్చిరి. మొదటివారు దేవుడు లేడందురు. రెండవ దేమిటనగా, దేవుడుంటే గమనించకుండా పోతున్నాడు. మూడవదేమిటనగా, అంతా పూర్వజన్మ కర్మవలన జరిగేది. నాల్గవది యేసు చెప్పినది. అదేమనగా. ఎవరిని నాశ నము చేయకూడదని దేవుడు అన్యాయములను ఓర్చుకొంటున్నాడనునది. యేసు

www.doctorpaul.org

జీవితమును గూర్చి, యేసు మరణమును గూర్చి ఎవరు వినిరో వారు సర్వశక్తిగల దేవుడు ఓర్చుకొనే తండ్రియని గ్రహించిరి. దేవుడు ఉన్నాడు, దేవుడు కనిపెట్టుచున్నాడు. అన్యాయమును గమనిస్తున్నాడు. అదే కారణముచేత తన కుమారుడైన యేసుక్రీస్తును బలిగా అర్పించుటకు ఇష్టపడెను. అన్యాయములు తీసివేయుటకుగాను దేవుడు ఆయనను బలిగా అర్పించెను. అన్యాయములు పోయే దైవమార్గమును ఎవరు గ్రహించకుండా పోతారో వారు తొందరపడతారు.

దేవునియందు ఇట్టి శ్రేష్ఠమైన ఓపిక ఎట్లు కలిగినదో, ఆయన యెందుకంతవరకు ఓర్చుకొంటున్నాడో యని మనమడుగ వచ్చును. ఆయన చేసే ప్రతి పనికి ఒక కారణ మున్నది. ఇట్టి లోతైన ఓపికకు కూడ ఒక కారణమున్నది. అదేదనగా : "మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది. మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసికొనుచున్నాడు" (కీర్తనలు 103:14). ఆయన మన స్థితిగతులు గ్రహించు చున్నాడు. మన సంచారములు ఆయన లెక్కించియున్నాడు. మన కన్నీళ్ళు ఆయన బుడ్డిలో నుంచబడి యున్నవి. (కీర్తనలు 56:8). ఆలాగున మనము ఒకరి స్థితిగతులను మరొకరము గ్రహించినట్లయితే ఒకరియెడల ఒకరము ఓర్పు కలిగియుండుట ఎంతో సులభము. అమెరికా దేశములో పేరుగల బోధకుడైన సమూయేలు జోన్సుగారు దీనికి సంబంధించిన కథ చెప్పేవారు. ఎడారిగుండా ఎండా కాలములో రోజంతా రైలులో ఆయన ప్రయాణము చేసినాడట. గాలిదుమ్ము వలన ప్రయాణికులందరు కిటికీలు తీసికొనలేకపోయిరి. మిక్కిలి వేడిచేత కిటికీలు వేసికొనలేకపోయిరి. దుమ్ము వలన అప్పుడప్పుడు కిటికీలు మూసికొనవలసి వచ్చినది. అప్పుడు ఎండవలన తెరవ వలసి వచ్చింది. ఆ రోజు ప్రయాణం అందరికీ చాల కష్టమైనది. చీకటి పడేటప్పటికి ఎడారి దాటిరి. ఈ అసాధారణ కష్టప్రయాణమైన తర్వాత అలసిపోయిన ప్రయాణికులు పండుకొనుటకు పక్కలు వేసుకొనినారు. ఒక మూలలో ఒక మనిషి ఒక పసిపిల్లను ఎత్తికొని ఆడించి నిద్రపుచ్చుటకు లాలి పాట పాడుచుండెను. కాని ఆయన ప్రయత్నము చేసినకొలది ఆ పిల్ల గుక్కపట్టి ఏడ్చినది. అలసిపోయినవారు పండుకొని నిద్రపట్టక అటు ఇటు కదులుతూ ముక్కుతూ మూల్గుతూ ఉండిరి. అప్పుడు మంచి కండపుష్టిగల యొక మనుష్యుడు లేచి – ఆ పిల్లను తల్లికీయకూడదా? అని పిల్లను ఓదార్చుటకు ప్రయత్నము చేస్తున్న మనిషిమీద కోపపడెను. అందరూ ఒక నిమిషము ఊరకుండిరి. అప్పుడు తండ్రి – ఈ పిల్ల తల్లి చచ్చిపోయినది. శవమును పెట్టెలో పెట్టి బ్రేక్‌వాన్‌లో ఎత్తికొని ఇంటికి తీసికొని పోతున్నారని జవాబిచ్చెను. అందరూ విచారముతో నిశ్శబ్ద ముగా ఉన్నారు. అప్పుడు కఠినముగా ప్రశ్న వేసిన ఆ బలమైన మనుష్యుడు బల్ల దిగి బట్టలు త్వరగా మార్చి తల్లి లేని పిల్ల దగ్గరకు పరుగెత్తికొని పోయి, తన బుద్ధిలేని ప్రశ్నకు గట్టి క్షమాపణ అడిగెను. ఆ పిల్ల తండ్రిని కొంచెము పండుకోమని వేడుకొనెను.

ఆ రాత్రియంత ఆ తల్లిలేని పిల్లను ఆయనే లాలించి ఓదార్చి నిద్రపుచ్చెను. ఇతరుల సందర్భమును ఎరుగక ఇతరులను సరిగా తెలిసికొనలేము. యేసుప్రభువు మన స్థితి గతుల నెరిగి ఓర్పుగలవాడై, మన అక్రమముల యెడల ఓర్పుగలవాడై తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించెను. మనము కూడ ఒకరి స్థితిగతులు మరొకరము ఎరిగి యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరిగెత్తుదము. ఓపికతో కూర్చొనరాదు. ఏమి చేయక ఓపికతో చాలించుకొనరాదుగాని, ఓపికతో పరుగెత్తుదము.

లూకా 21వ అధ్యాయములో యుద్ధములు, హింసలు, నానా వడగండ్లు, భూకంపములు, కరువులు మొదలైనవాటిని గురించి మనము చదువవచ్చును. మనము ఈ సంగతులనన్నింటిని ఎట్టి మనస్సుతో ఎదుర్కొనవలెనో, ఈ అధ్యాయము మధ్యనున్న యొక చిన్న వచనమే బోధించుచున్నది. "మీరు మీ ఓర్పుచేత మీ ప్రాణములను దక్కించుకొందురు." (లూకా 21:19).

ఓర్పులేని తనము సర్వసామాన్యమైన తప్పు. ఇది బుద్ధిని చెరుపును. తరచుగా ఓర్పు మనకు లేకపోవుచున్నది. అది ఎంత అవసరము. మనలో కొందరికి, ఇతరుల కంటెను అది అత్యవసరము. కావున క్రీస్తు ఓర్పు చూచినప్పుడు మనలో ప్రతివానికి అది ఎంత అవసరమో తెలియనగును. బడి పిల్లలకు ఓర్పు అవసరము; లేనియెడల పాఠములు సరిగా చదువలేరు. ఆట భూమియందు పిల్లలకు ఓర్పు అవసరము, అది లేకుండినయెడల చట్టముల ననుసరించలేరు. బడిపంతులకు ఓర్పు అవసరము, అది లేకపోయినయెడల పిల్లలను క్రమశిక్షణయందు నడుపలేక మంచి పని చేయలేడు. తల్లికి ఓర్పు చాలా అవసరము, లేకపోతే తల్లి పిల్లలను ముందాలోచన లేకుండా జాలి లేకుండా పలుమార్లు శిక్షించును. తల్లి బాధ్యతలు చాలా భారమైనవి. ఓర్పు చాలా అవసరము. తండ్రికి ఓర్పు అవసరము. అదియుంటే తన పని బాగుగా చేయగలడు. తన పని భారమునకును, కుటుంబ పోషణ భారమునకును ఓర్పు అత్యవసరము.

ఒకానొకప్పుడు ఒకడు ప్రధాన మంత్రి కుండవలసిన, అవసరమైన ముఖ్య గుణ లక్షణము లేవని ఒక మంత్రిగారిని అడిగినాడట. 'ఓర్పు' అని జవాబిచ్చినాడు. అవసరమైన రెండవ లక్షణమేమని అడుగగా, ఆ మంత్రి, "ఓర్పు" అని త్వరగా జవాబిచ్చినాడు. మరీ యవసరమైన మూడవ లక్షణమేమిటని మరల యడుగగా, "ఓర్పు" అని గట్టిగా చెప్పినాడు. ఈ రీతిగా మంత్రి మనకు ఓర్పుయొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పియున్నాడు.

మరియొక సమయమున పిల్లలను దీవించమనుచు జనులు రాగా, శిష్యులు వారిని వెనుకకు త్రోయుట యేసు చూచి, వారిమీద కోపపడి – "చిన్నబిడ్డలను నాయొద్దకు రానియ్యుడి; వారి నాటంక పరచవద్దు; దేవుని రాజ్యము ఈలాటివారిదే" యని చెప్పెను.

www.doctorpaul.org

(మార్కు 10:14). యేసు శిష్యులవలె మన మెన్నియో మారులు చిన్నపిల్లల విలువ గుర్తించక పోయినాము. చిన్న పిల్లల మనస్సు వెన్నవంటిది. మనము చెప్పు ప్రతి మాట, చేయు ప్రతి పని బిడ్డల మనస్సులో నాటుకొని బిడ్డ పెరిగిన మీదట దాని గుణము కనిపించక మానదు. పిల్లల విషయములో మనమెంతో జాగ్రత్తగా నుండవలెను. ఈ చిన్నతనములో పిల్లలు తనను ప్రేమించ నేర్చుకొనినయెడల ఆ ప్రేమ వారి వయస్సుతో పాటు క్రమక్రమముగా పెరిగి, వారు తన అనుచరులు అగుదురని యేసుకు తెలియును. కథోలిక్ వారు ఒక పిల్ల తన మొదటి ఆరు సంవత్సరములు మా తర్ఫీతులో నుంటే ఆ పిల్ల జీవిత కాలమంతయు కథోలిక్‌గా నుండునని చెప్పుదురు. శిష్యులు బిడ్డలను వెనుకకు త్రోసివేసినప్పుడు యేసు వారియెడల ఓర్పులేకుండ కోపపడినందున పిల్లల విలువను గూర్చి ఆయన మనకు నొక్కి చెప్పెను. మన కుటుంబ ప్రార్థనలెంతో ముఖ్య మైనవి. మన బిడ్డలను బడికి పంపుటయు ఎంతో ముఖ్యమైనది.

యేసు ఓర్పులేకుండ ఉన్న సమయము మరియొకటి కలదు. దేవాలయ మనునది ప్రార్థన కొరకును, ఆరాధన కొరకునైయున్నది. కాని యేసు కాలములో యెరూషలేములోని దేవాలయము బజారుగా మార్చబడినది. యేసు యొక కొరడా తీసికొని అక్కడి యెడ్లను బయటకు త్రోలివేసి, రూకలు మార్చువారి బల్లలను పడద్రోసి "నా మందిరము ప్రార్థన మందిరమనబడును; అయితే మీరు దానిని దొంగల గుహగా చేసినార"ని గద్దించెను. యేసుయొక్క న్యాయ సమ్మతమైన ఆగ్రహము మనకును కలుగునుగాక! యేసుయొక్క న్యాయ సమ్మతమైన ఓర్పులేనితనము మనకును కలుగునుగాక! (మార్కు 11:15-18).

1. జబ్బు పడినవారిని స్వస్థపరచు విషయములోను
2. పిల్లలను లక్ష్యపెట్టు విషయములోను
3. దేవాలయమును పరిశుభ్రముగా ఉంచుకొను విషయములోను

మనమందరము ప్రభువైన యేసువలె ఓర్పులేకుండ శ్రద్ధ వహించుదుము గాక!

ఎన్ని మారులు మానవులు ఓర్పు లేకపోవుటచేత తమ్మును తాము గాయపరచు కొనుచున్నారు. మోషే ఇశ్రాయేలీయులను అరణ్యములో చాలా యేండ్లు కాపాడిన తర్వాత "ద్రోహులారా, వినుడి; మేము యీ బండలోనుండి మీకొరకు నీళ్ళు రప్పింప వలెనా?" (సంఖ్యా. 20:7-13) అని ఓర్పులేని నిమిషములో చెప్పి దేవుని మహిమపరచ కుండా ఆ గొప్పతనమును తనకు అంటగట్టుకొన్నందున దేవుడు కనాను దేశములోనికి తన జనులతో మోషేను పోనీయ లేదు. సిరియా దేశపు సైన్యాధిపతియైన నయమాను తన కుష్ఠరోగమును బాగుచేసికొనుటకు ఎలీషా దగ్గరకు రాగా, ఎలీషా, నీవు యొర్దాను నదిలో స్నానము చేసిన యెడల బాగుపడెదవని సెలవిచ్చెను. మొదట నయమాను ఓర్పులేక, "నేను పోను; ఆ నది నీళ్ళు బురద నీళ్ళు; ఎట్లయినను అది పిచ్చి పని;

అది పనికిరాద”ని ఓర్పులేని నిమిషములో చెప్పినప్పటికినీ, తన మనస్సు మార్చుకొని, ఆ నదిలో స్నానముచేసి బాగుపడినందున మనకు సంతోషము. (2 రాజులు 5:1-19). ఆయన మనస్సు మార్చుకొనకపోతే ఎట్లుండును? ఓర్పులేనితనము మనమీద పరిపాలించకుండునట్లు జాగ్రత్తగా నుందుముగాక!

ఎన్నియో మారులు మనకు ఓర్పులేకపోవుటచేత యితరులను నొప్పించితిమి? శిష్యులు ఓర్పులేకుండా అన్యురాలిని యేసు దగ్గరనుండి ఎట్లు తరిమివేయ ప్రయత్నించిరో జ్ఞాపకము చేసికొందము. యేసు వారిని తమ ఇష్టప్రకారముగా చేయనిచ్చియుండిన యెడల ఆ స్త్రీ కుమార్తె బాగుపడి యుండదు. (మత్తయి 15:21-28). మరియొక సందర్భమునందు కూడ శిష్యులు ఓర్పులేకుండ యేసునొద్ద పిల్లలు ఆశీర్వాదము పొందకుండునట్లు ఆటంకపర్చిరి. (మార్కు 10:13-16). మన ఓర్పులేని తనమువల్ల యితరులను నొప్పించకుందుము గాక!

సహాయము కొరకు యేసుమీద కిక్కిరిసిపడిన జనులతో ఆయన ఎంతో ఓర్పుగా నుండెను. జనులు ఆయనయొద్ద ఉన్నప్పుడు ఆయనకు విశ్రాంతి లేకపోయినది. ఒకసారి విశ్రాంతికొరకు అరణ్యమునకు పోయిన తర్వాత, జనులక్కడికినీ రాగా ఆయన వారిని చూచి వారు కాపరిలేనివారని వారిపై జాలిపడెను. ఆయన అధికముగా అలసి యుండినను, వారు భోజనము చేయకుండ ఆయనను వెంబడించుటచేత జాలిపడి ఓర్పుతో వారికి భోజనము పెట్టెను. ఆయన జీవితమంతయు ఓర్పుతోను, ఇతరులకు పరిచర్య చేయుటతోను నిండియుండెను. ఆయన చనిపోయిన మీదట ఆయననుగూర్చి చెప్పబడిన మంచి మాటలలో నొకటేమిటనగా, “ఆయన మేలుచేయుచు సంచరించుచుండెను.” (అపొ.కా. 10:38). జనులు అడిగిన సహాయమును ఆయన కాదన్నప్పటికిని అది యెంతయో ఓర్పు, ప్రేమ, ఆలోచనలతో చెప్పినదే. ఆయన ఒకసారి జనులకు భోజనము పెట్టిన తర్వాత మరియొక మారును వారందుకే రాగా, “రొట్టెలు భుజించి తృప్తి పొందుట వలననే నన్ను వెదుకుచున్నారు. క్షయమగునట్టి యాహారము కొరకు వెదుకవద్దు. పరలోకము నుండి వచ్చు అక్షయమైన ఆహారము కొరకు వెదకుడి, నేనే పరలోక ఆహారమ”ని యేసు ఓర్పుతో చెప్పెను. (యోహాను 6:22-35).

ఒక్కొక్కప్పుడు మనము “ఈ పని లాభదాయకమైనది కాదు, దీనివలన దమ్మిడీ లాభము లేదు. ఈ పని నాకిష్టము లేదు గాన మరియొక పని చేసిన బాగుండున”ని చెప్పుట కద్దు. స్థిరమనస్సు లేక యీ పని కాదు, ఆ పని కాదు, మరొక పని అంటూ వ్రేలు పెట్టువారిని మనము చూచుచుందుము, అటువంటి వారు బాగుపడుట ఎక్కడైనా ఉండదు. “పొరుగింటి పుల్లకూర రుచి,” “కంచ అవతల పచ్చిక పచ్చనిది” అన్నట్లు. అయితే యేసు ఆ పనినుండి ఈ పనికి, ఈ పనినుండి ఆ పనికి పోలేదు. ఆయన తన పనిని స్థిరమనస్సుతోను, ఓర్పుతోను చేసి ముగించెను.

నెమ్మదిగా నేర్చుకొనెడి స్వభావముగల శిష్యులకు బోధించుటలో యేసు యొక్క ఓర్పును, సహాయముకొరకు అడిగిన వారియెడల యేసు యొక్క ఓర్పును, తన పని భారమందు ఆయన యొక్క ఓర్పును చూచితిమి. తండ్రి చిత్తమునకు లోబడు విషయములో కూడ ఆయన యొక్క ఓర్పును మాదిరిగా తీసికొందము. దేవుని చిత్తమునకు ఎదురాడి – “దేవుడు అన్యాయస్థుడు; దేవుడు నన్ను గమనించుట లేద”ని మనము చెప్పియుండ వచ్చును. మనమీరీతిగా చెప్పియుండిన యెడల యేసు సిలువ యొద్దకు వెళ్ళి – “నా చిత్తము కాదు, నీ చిత్తమే జరుగును గాక” అని ఆయన అన్నట్లుగా మనము చెప్పుట లేదు. “మేము దృశ్యమైనవాటిని చూడక అదృశ్యమైనవాటినే నిదానించి చూచుచున్నాము” (2 కొరింథీ. 4:17,18) అని పౌలుతో కలసి చెప్పుదుము గాక! పౌలు మాటలు వట్టివి కావు; అనుభవముతో కూడినవి. పౌలు తాను దర్శించిన ప్రతి గ్రామము నుండియు, పట్టణము నుండియు తరిమివేయబడినప్పటికినీ తిరిగి అదే స్థలములను సందర్శించినాడు.

పౌలు శరీరములో ఒక ముల్లుండినది. ఆ ముల్లేమిటో ఎవరికిని తెలియదు. కొందరు అది కంటి జబ్బంటారు, మరికొందరు చలిజ్వరమంటారు. ఒక సంగతి మాత్రము మన మెరుగుదుము. ఈ ముల్లు ఆయనకు చాలా బాధకరమైనది. “దేవా, నా యొద్దనుండి ఇది తొలగించుమ”ని మూడు మారులు ప్రార్థించెను. “నా కృప నీకు చాలును; బలహీనత యందు నా శక్తి పరిపూర్ణమగుచున్నది” అని దేవుడాయనకు జవాబిచ్చెను. “కాగా క్రీస్తు శక్తి నామీద నిలిచియుండు నిమిత్తము విశేషముగా నా బలహీనతల యందే బహు సంతోషముగా అతిశయపడుదును. నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను గనుక క్రీస్తు నిమిత్తము నాకు కలిగిన బలహీనతలలోను, నిందలలోను, ఇబ్బందులలోను, హింసలలోను, ఉపద్రవములలోను నేను సంతోషించుచున్నాను” అని పౌలు ఓర్పుతో సహించి దేవుని కృపను, దేవుని శక్తిని మరియెక్కువగా అనుభవించెను. (2 కొరింథీ. 12:1–12).

పౌలు దేవుని చిత్తమునకు ఓర్పుతో లోబడినట్లు మనమును దేవుని చిత్తమునకు ఓర్పుతో లోబడుదుముగాక! మనము పౌలు, ప్రభువైన యేసుల ఓర్పును గూర్చి ఆలోచించుచుండగా, వారి ఓర్పు వారి బలహీనతవలన కలిగినదని మనము తలంచరాదు. వారు అస్థిరులైనందున వారికి ఓర్పు కలుగలేదు. వారు ఇటునటు ఊగులాడువారు కారు. వారి ఓర్పు స్థిరమైనది. పైగా వారు సుఖదుఃఖములను సమానముగా నాలోచించనందున వారికి ఓర్పు కలుగ లేదు. వారి ఓర్పు కామక్రోధాదులు లేనందున కలిగినది కాదు. ఓర్పు వారికి సుఖదుఃఖములను కలిగించినది. సుఖదుఃఖములను కలిగించుటలో వారు ఓర్పు కలిగియుండిరి. పైగా వారి ఓర్పు తాత్కాలికమైనది కాదు.

"నేను ప్రస్తుత స్థితినిబట్టి ఓర్చుకొందును. గాని తరుణము దొరికితే వీని పని చూతును" అనునటువంటి ఓర్పుకాదు వారిది. వారి ఓర్పు "ఏమి వచ్చినను సరే, నేను ఓర్పుగలిగి యుందున"ని తీర్మానించుకొనిన యొక బలవంతుని ఓర్పు వంటిది. అడవిలో నొక మిక్కిలి పెద్ద సింహము కలదు. అనేక చిన్న మృగములు దానిచుట్టు జేరి మొరుగుచు దానిని కరువబోయి నట్లుండినవి. కాని ఆ పెద్ద సింహము కదలక మెదలక ఓర్పుతో భయమొందక నెమ్మదిగా పరుండి చూచుచూ యుండినది. ఈ రీతిగనే మనమును కదలక మెదలక భయమొందక నెమ్మదిగాను, ఓర్పుతోను కాలము గడుపుదుముగాక!

మన ఓర్పులేనితనము వలనను, మనము స్వలాభమును అపేక్షించుట వలనను, మన గర్వభంగము వలనను సాధారణముగా మనము కోపపడుదుము. ఓర్పు లేకుండుట మనలో ఎక్కువమంది వాడుక. ఓర్చుకొనుట మనలో ఎక్కువమందికి కష్టతరము. మనమే విషయములలో ఓర్పు గలిగియుండ రాదో, యే విషయములో ఓర్పు గలిగి యుండవలెనో యేసు మనకు మాదిరి చూపించెను. మనమందరమును ఆయన మాదిరి ననుసరించుట కేవలము అగత్యము. పాపము యెడల మనము అధికముగా ఓర్పుగలిగి యుండరాదు. "దేవునితో మాటలాడి ఆయన చిత్తము చొప్పున నేను నిలుచుచున్నాను; నేను వేరేమియు చేయలేను; దేవుడు నాకు తోడైయుండును గాక" అని చెప్పుచు పాపముల యెడల అధిక ఓర్పు కలిగియుండకుండువారు ఈ దినముల యందు ఎంతో అవసరము. భూమ్యాకాశములు తలక్రిందులైనను, న్యాయమైన దాని ననుసరించుచు మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. సుళువుగా చిక్కుల బెట్టు పాపములను విడిచిపెట్టి యేసువైపు చూచుచు ఈ పందెములో ఓపికతో పరుగెత్తుదము.

ఓర్పు! ఓర్పు! ఓర్పు! కావలసినవానికి క్రీస్తు యెంతో మంచి స్నేహితుడును మాదిరియునై యున్నాడు. ఈ పుస్తకము ముగించుచున్నాము. మొదటి మూడు అధ్యాయములలో యేసుప్రభువు అడుగులలో నడుచుటకుగల కారణములను ఆలోచించితిమి. తరువాత యేసుసిలువ యొక్క వెలుగులో తీర్పు తీర్చబడి ఆ సిలువ దగ్గర నిలువబడినవారిలో మనమెలాంటివారమై యున్నామని చూచితిమి. ఆఖరి మూడు అధ్యాయములలో వ్యసనాక్రాంతుడును, శాంతిపరుడును, ఓర్పుశాలియునై యున్న యేసుప్రభువు అడుగులలో నడుచు విధములను పరీక్షించితిమి. ఆయన చేసిన వాగ్దానము ప్రకారముగా ఆయన మనకు తోడైయున్నాడు. మరి శ్రేష్ఠముగా ఆయన మనలో ఉన్నాడు కాబట్టి ఆయన యొక్క వ్యసనము, ఆయన యొక్క శాంతి, ఆయన యొక్క ఓర్పు మనలో ఉండును గాక!